క్లుప్తంగా

ఆర్చరీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా వేణు


పావురాల వేణు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పావురాల వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో సోమవారం ఆయన్ను ఎంపిక చేయగా, 2029 వరకు కొనసాగుతారు. అలాగే జిల్లాకు చెందిన సీనియర్ కోచ్ విజయ్ భరద్వాజ్‌ను రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఈ క్రమంలో వేణుకు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాయలంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్స్‌ను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శరవేగంగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈనెల 15వ తేదీ విద్యుత్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు ఇస్తోందన్నారు. సమావేశంలో గోగుల శ్రీనివాసులు, టీవీవీ ప్రసాద్, అన్నపూర్ణమ్మ, రెహనాబేగం, గోపాల్ సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలను సరిదిద్దండి

నెల్లూరురూరల్: తహసీల్దార్ స్వాతి చేసిన అవకతవకలను సరిదిద్దాలని నెల్లూరు ఆర్డీఓ అనూషకు బీజేపీ నేత మిడతల రమేష్ సోమవారం విజ్ఞప్తి చేశారు. ఆమె పొదలకూరు తహసీల్దారుగా విధులు నిర్వహించేటప్పుడు రికార్డులను ట్యాంపరింగ్ చేశారని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు బదలాయించారని, ఒకరి ఆస్తులనే మరొకరికి బదలాయిస్తూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారన్నారు. ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారని, అయినప్పటికీ రికార్డుల్లో జరిగిన అవకతవకలను సరిదిద్దకుండా వదిలివేసి ఉన్నారన్నారు.

మొగళ్లపల్లి సత్రం ఆస్తులను వినియోగంలోకి తేవాలి

నెల్లూరు(బృందావనం): నగర నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే మొగళ్లపల్లిసత్రం ఆస్తులను ఆధునిక నిర్మాణాలతో వినియోగంలోకి తేవాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలోని పరిపాలనాధికారి శ్రీలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పేద ప్రజల సేవా కార్యక్రమాల కోసం ఇచ్చిన విలువైన ఆస్తులు నేడు నిరుపయోగంగా ఉండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, కంచర్ల నారాయణయాదవ్, బుధవరపు బాలాజీ, భాస్కర్ పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): తన భార్యతో చనువుగా ఉన్నాడనే అనుమానంతో స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. వెంగళరావు నగర్‌లో ఉదయ్‌కుమార్, అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి స్నేహితులు. ఈ క్రమంలో ఉదయ్‌కుమార్ తన భార్యతో చనువుగా ఉంటున్నాడని సదరు వ్యక్తి కక్ష పెంచుకున్నారు. ఈనెల 10వ తేదీ ఉదయ్‌కుమార్ తన ఇంటి దగ్గర ఒంటరిగా ఉండగా నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి ఇనుపరాడ్డుతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో స్థానికులు ఉదయ్‌కుమార్‌ను హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోభనాద్రీశ్వరరావుపై పోలీసుల వైఖరి దారుణం

నెల్లూరు(అర్బన్): మాజీ మంత్రి, ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పట్ల పోలీసులు అనుచిత వైఖరిని ఖండిస్తున్నామని ఏపీ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం అడ్డతీగల ప్రాంతంలో గత 114 రోజులుగా జిందాల్ బాధిత రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా 81 ఏళ్ల వడ్డే శోభనాద్రీశ్వరరావు వెళ్తుంటే నడిరోడ్డుపై ఆపేసి రెండు గంటల పాటు పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి ఘటనలో ఏడుగురి అరెస్ట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురు వ్యక్తులను చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డుకు చెందిన సయ్యద్ మున్వర్ గాంధీ బొమ్మ వద్ద ఓ దుకాణంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో మీరా మొహిద్దీన్‌తో పాటు పలువురి భాగస్వామ్యంతో కలిసి ఆయన రవీంద్ర నగర్‌లో కొంత స్థలాన్ని ఆరేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ స్థలం వివాదంలో ఉండడంతో విక్రయానికి వీలు కాలేదు. దీంతో తన డబ్బులు ఇవ్వాలని మీరా మొహిద్దీన్ గత కొన్ని రోజులుగా మున్వర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం మీరా మొహిద్దీన్ మరికొందరితో కలిసి మున్వర్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన ఏడుగురిని అరెస్ట్ చేశారు.

నకిలీ మద్యాన్ని తక్షణమే అరికట్టాలి


ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి


ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు

- సూత్రధారులపై చర్యలకు డిమాండ్
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రణభేరి
- భారీగా తరలివచ్చిన మహిళలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నకిలీ మద్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. నగరంలోని నీలగిరి సంఘం వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరిలో ఎమ్మెల్సీ పాల్గొని, మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నేతలే నకిలీ మద్యాన్ని తయారు చేసే సూత్రధారులుగా చెలామణి అవుతున్నారన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని పెంచి పోషిస్తున్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం విషయంలో పారదర్శకతను పెంచి రాష్ట్రంలో అతి తక్కువ దుకాణాలు ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో నకిలీ మద్యానికి తావులేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించి బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు లేకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను టీడీపీ నేతలకు కట్టబెడుతూ, నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లోనే మద్యం దుకాణాలు నడుస్తున్నాయని, వారి దుకాణాల్లోనే నకిలీ మద్యం అమ్ముతున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల్లో తనిఖీలు చేయాలంటే భయపడుతున్నారని, అందుకు కారణం అవి టీడీపీకి చెందిన వారివి కావడమేనన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో నకిలీ మద్యంతో పాటు చీప్ లిక్కర్, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండడంతో ఎక్కువ మంది వీటికి బానిసలై పట్టపగలే హత్యలు చేసే స్థితికి దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా నకిలీ మద్యం అమ్ముతున్న కేటుగాళ్లపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ పెద్ద పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ పరిశీలకుడు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యం


నిరసన తెలుపుతున్న రూరల్ నాయకులు

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో నకిలీ మద్యం ప్రజల ప్రాణాలను హరిస్తోందని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలా మార్చిందన్నారు. నకిలీ మద్యం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కసుతోనే ప్రైవేటీకరణ


కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి


ప్రజలతో సంతకాల సేకరణ చేయిస్తున్న విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని, ఆయనకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో చంద్రబాబు వాటిని ప్రైవేట్‌కు అప్పగిస్తూ దుర్మార్గమైన నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రామ్‌జీ నగర్‌లోని పార్టీ సిటీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మొదటి సంతకం చేసి, మాట్లాడారు. గత ప్రభుత్వం 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకొచ్చిందని, దీని ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ప్రైవేటుకు కట్టబడుతోందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నగర నియోజకవర్గంలో 60 వేల నుంచి లక్ష సంతకాల వరకు సేకరిస్తామని తెలిపారు. దీనిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన గవర్నర్‌కు పంపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే.. కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి చర్యలు దారుణం

నెల్లూరు సిటీ: రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామాల్లో సోమవారం రచ్చబండ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేపట్టారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీకి అనుమతులు తప్పనిసరి అని సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాణసంచా వ్యాపారులు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అనుమతులు పొందిన తరువాతే విక్రయాలు సాగించాలని కోరారు. అనుమతుల్లేకుండా విక్రయాలు సాగించినా, తయారు చేసినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

నెల్లూరు(బారకాసు): నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 28, 29 డివిజన్లలో జీఎన్టీ రోడ్డు ఎస్బీఐ బ్యాంక్, సాయిబాబా మందిరం, టెక్కేమిట్ట, మద్రాసుబస్టాండ్, కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు రోడ్లపై నిలబడకుండా కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపట్టాలని, సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్ల పరిధిలో నూతన భవనాలకు అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. ఖాళీ స్థలం పన్నులను చెల్లించే విధంగా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

17న ప్రత్యేక విద్యుత్ అదాలత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు టౌన్ డివిజన్ విద్యుత్ వినియోగదారులకు ఈనెల 17న ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ నియం సబ్‌స్టేషన్ పక్కన ఉన్న సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో రామ్మూర్తి నగర్, ఏకే నగర్, రాజేంద్రనగర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు బాలికల దినోత్సవం

నెల్లూరు(పొగతోట): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం డీకే డబ్ల్యూ కాలేజీ నుంచి ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం జీజీహెచ్‌లో బాలికల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు.

విస్తృతంగా అభివృద్ధి పనులు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో రూ.50 కోట్లతో 18 గ్రామాలు, మూడు డివిజన్లలో ప్రజలకు విద్యుత్ కష్టాల్లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మరో పది రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



నెల్లూరు(అర్బన్): సీపీఆర్ గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్, ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ అన్నారు. సీపీఆర్ అవేర్‌నెస్ వారోత్సవాలను పురస్కరించుకుని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో పిల్లలు, వారి తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనిషికి అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు కొన్ని సందర్భాల్లో కార్డియాక్ అరెస్ట్(గుండె హఠాత్తుగా ఆగిపోవడం) జరుగుతుందన్నారు. తక్షణమే క్షణాల్లో గుండె పైభాగంలో సాంకేతిక పద్ధతిలో రెండు చేతులతో మసాజ్‌లా చేస్తే గుండె వెంటనే పని చేస్తుందన్నారు. దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ సుందర్‌రాజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్లు బయ్యా ప్రసాద్, సెక్రటరీ మస్తానయ్య పాల్గొన్నారు.

ముగ్గురి నేత్రదానం


పద్మనాభరెడ్డి(ఫైల్)


మన్సూర్(ఫైల్)


సురేష్‌రెడ్డి(ఫైల్)

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందగా వారి కుటుంబసభ్యుల అంగీకారంతో మృతుల కార్నియాను సేకరించారు. కావలి పట్టణం వైకుంఠపురానికి చెందిన పాలవెల్లి పద్మనాభరెడ్డి(58) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో మృతుని భార్య మాధవి, కుమార్తెలు లిఖిత, తనూజల అంగీకారంతో ప్రభుత్వ పెద్దాస్పత్రికి పద్మనాభరెడ్డి నేత్రాలను దానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఎంసీ సభ్యులు శ్రీహరిరెడ్డి, గోపాల్‌రెడ్డి సమక్షంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు.

- కోవూరుకు చెందిన షేక్ మన్సూర్(28), పుచ్చలపల్లి సురేష్‌రెడ్డి(49)లు సోమవారం ఉదయం నెల్లూరు మూడో మైలు కూడలి వద్ద హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మృతుడు మన్సూర్ తండ్రి మస్తాన్‌వలీ అంగీకారంతో, అలాగే మరో మృతుడు సురేష్‌రెడ్డి బావమరిది ప్రసన్నకుమార్‌రెడ్డి అంగీకారంతో వారి నేత్రాలను నెల్లూరు పెద్దాస్పత్రికి దానం చేశారు. వారి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్‌కుమార్ సేకరించి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌లు అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచుకున్న వారు 99595 89321 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైల్వే సిబ్బందికి క్రీడా పోటీలు

నెల్లూరు సిటీ: స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరంలో రైల్వే సిబ్బందికి సోమవారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శివయ్య, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై శాశ్వత పరిష్కారానికి చర్యలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): స్థానిక సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ కోరారు. ఎస్ఎంసీ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలకు సమగ్ర పరిష్కారం చూపాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు రోడ్లపై చేరకుండా కాలువల నిర్మాణం, మరమ్మతు పనులను అన్ని డివిజన్లలో చేపడుతున్నామని తెలిపారు. ఖాళీ స్థలాలను వాటి యజమానులు పరిశుభ్రంగా ఉంచుకునేలా సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. కాగా ప్రజల నుంచి 68 అర్జీలు అందాయని, వాటిలో అకౌంట్ సెక్షన్–4, ఆప్కాస్–6, ఇంజినీరింగ్–15, హౌసింగ్ సెక్షన్–24, పబ్లిక్ హెల్త్–4, రెవెన్యూ–4, టౌన్ ప్లానింగ్–7, పెన్షన్–4 చొప్పున అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి వచ్చే అర్హత మోదీకి లేదు



మాట్లాడుతున్న మున్నా, మస్తాన్ షరీఫ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వచ్చే అర్హత లేదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ అన్నారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాను తిరిగి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి యువతను మోదీ మోసం చేశారన్నారు. ఈనెల 16వ తేదీ కర్నూలు జిల్లాకు మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే పనులు చేస్తున్న మోదీ.. ఇక్కడికి రావల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రానికి తీసుకురావడంతో విఫలమైన చంద్రబాబు సర్కార్ సోషల్ మీడియా, పచ్చ మీడియాలో డప్పులు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఏమి చేస్తున్నాడో చెప్పాలని నిలదీశారు. ఈనెల 15న వామపక్షల ఆధ్వర్యంలో గో బ్యాక్ మోదీ అనే నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో గౌస్‌బాషా, మీరా మెహిద్దీన్, నాగూర్, చైతన్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ



నెల్లూరు (టౌన్): జీఎస్టీ 2.0పై ఏపీ కార్మిక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని సోమవారం నగరంలో నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై పన్ను రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గించడం వల్ల వాహన కొనుగోలు వ్యయం, ఈఎంఐలు, నిర్వహణ భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ విజయకుమార్‌రెడ్డి జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ గౌస్‌పీరా, గోపిచంద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షేక్.గౌస్, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరురూరల్: సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ నగరంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవు దినాల్లో అక్రమంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, దీనిపై విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యగ్నేష్, నాగేంద్ర, మహేశ్వర్, సుమంత్ పాల్గొన్నారు.

బాలుడికి అరుదైన చికిత్స

- సీపీఆర్‌తో తిరిగి పనిచేసిన గుండె



బాలుడి తండ్రితో కలిసి మాట్లాడుతున్న కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): తేలుకుట్టి తీవ్ర విషమ పరిస్థితి, ఆయాసంతో తమ ఆస్పత్రికి వచ్చిన ఓ బాలుడికి అరుదైన అత్యవసర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ మురార్జి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బాలుడి తండ్రితో కలిసి సోమవారం దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 8న తిరుపతి జిల్లా తడ మండలంలోని పాములమెట్ట గ్రామానికి చెందిన 13 ఏళ్ల అభిలాష్‌కు తేలుకుట్టిందన్నారు. విషమ పరిస్థితిలో ఇక్కడికి తీసుకొచ్చారన్నారు. తాము ఐసీయూలో చేర్చి పరీక్షలు చేయగా గుండె పనితీరు 15కి పడిపోయిందన్నారు. అంతేకాకుండా విషం వల్ల గుండె ఆగిపోయిందన్నారు. వెంటనే సీపీఆర్ చేయడంతో గుండె మళ్లీ పనిచేయడం ప్రారంభించిందన్నారు. తరువాత ఆ బాలుడిని ఐసీయూలోనే వెంటిలేటర్‌పై ఉంచి విషానికి విరుగుడు మందుతో పాటు గుండెకు లోనోట్రాపర్‌తో చికిత్స అందించామన్నారు. 48 గంటలపాటు తమ డాక్టర్ల బృందం దగ్గరుండి క్లిష్టతరమైన చికిత్సను అందించడంతో కోలుకున్నాడన్నారు. రెండు రోజుల్లోనే వెంటిలేటర్‌ను తొలగించామన్నారు. ఇప్పుడు డిశ్చార్జి చేస్తున్నామన్నారు. బాలుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని కిమ్స్ ఆస్పత్రి ఈడీ గిరినాయుడు అభినందించారు. కార్డియాలజిస్ట్ నాగరాజరావు, ఇంటెన్సివిస్ట్ హెచ్ఓడీ జగదీష్, డాక్టర్లు పల్లవి, భార్గవ్, శ్రీధర్‌రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచలరావు మరణం తీరనిలోటు

నెల్లూరు(పొగతోట): ఏపీఎన్జీఓ నాయకుడు మన్నెపల్లి పెంచలరావు మరణం తీరనిలోటు అని ఏపీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

నేటి నుంచి అండర్–19 స్కూల్ గేమ్స్

నెల్లూరు (టౌన్): అండర్–19 స్కూల్ గేమ్స్‌కు సంబంధించి బాల, బాలికలకు మంగళవారం నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీవీఈఓ కృష్ణారెడ్డి, ఆర్ఐఓ వరప్రసాదరావు, అండర్–19 గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న స్థానిక చిల్డ్రన్స్‌పార్కు ఎదురుగా ఉన్న శ్రీఆనంద్ చెస్‌వింగ్స్‌లో చదరంగ పోటీలు, దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో క్యారమ్స్, 15న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాస్కెట్ బాల్, 16న కోడూరుపాడులోని జెడ్పీ హైస్కూల్‌లో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు.